# స్ఫూర్తిదాయకంగా ప్రపంచవ్యాపితంగా 'మేడే' కార్యక్రమాలు



క్యూబాలో మేడే నాటి ప్రదర్శన

**అంతర్జాతీయ** కార్మికవర్గ దీక్షాదినం 'మేడే' నాడు వివిధ ప్రపంచ దేశాలలో కార్మికులు స్ఫూర్తిదాయకంగా ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యంగా ఉక్రెయిన్‌పై యుద్ధం సాగుతున్న నేపథ్యంలో ముందుకొచ్చిన ఈ మేడే సందర్భంగా యుద్ధోన్మాదం నశించాలని, ప్రపంచశాంతి వర్ధిల్లాలని నినదిస్తూ శ్రమదోపిడీ రద్దుకావాలని, సామ్యవాదం అజేయమంటూ ప్రదర్శనలు నిర్వహించారు.

ఫ్రాన్స్‌లో దేశవ్యాపితంగా 200 మేడే ప్రదర్శనల్లో వేల సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. వారు ఈ సందర్భంగా తమ వేతనాల పెరుగుదలను డిమాండ్ చేయటంతోపాటు రిటైర్‌మెంట్ వయసును 62 సం॥ నుండి 65 సం॥కు పెంచాలనే తమ దేశాధ్యక్షుడు మాక్రాన్ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. పారిస్‌లో జరిగిన ప్రదర్శనలు ఉద్రిక్తంగా మారాయి. నల్లదుస్తులు ధరించిన నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో లోయర్ మాన్‌హటన్ నుండి వేలాది మంది కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. యాజమాన్యపు కుట్రలన్నింటినీ ఎదుర్కొని అమెజాన్‌లో ఇటీవలే కార్మికులు యూనియన్‌గా సంఘటిత మయ్యారు; వీరంతా ఇంకా అసంఘటితంగా వున్న కంపెనీలలోని కార్మికులందరినీ యూనియన్‌లను ఏర్పరచు కోవలసిందిగా సందేశమిచ్చారు.

టర్కీలోని ఇస్తాంబుల్‌లో అనుమతి లేకుండా మేడే ప్రదర్శన నిర్వహిస్తున్నందుకు టాక్సమ్ స్క్వేర్ వద్ద 164 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాన్‌ఫెడరేషన్ ఆఫ్ ప్రోగ్రెసివ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ టర్కీ ఆధ్వర్యంలో వేలాదిమంది పాటలు పాడుతూ, జెండాలు, బ్యానర్లు ప్రదర్శిస్తు ఈ కార్యక్రమంలో పాల్గొనటాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

క్యూబాలో లక్షలాదిగా ప్రజానీకం మేడే నాడు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. క్యాస్ట్రోతో సహా క్యూబా విప్లవ నాయకుల చిత్రపటాలను ప్రదర్శించారు. ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ అధ్యక్షులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. మేడేతోపాటుగా 63 ఏళ్ళ క్యూబా విప్లవ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకున్నారు.

జర్మనీలోని బెర్లిన్‌లో జర్మన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ (డిజిబి) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన మేడే ప్రదర్శనలో 'భవిష్యత్తును సమిష్టిగా నిర్మించుకుందాం' అనే బ్యానర్‌లో కార్మికులు పాల్గొన్నారు.

ఇటలీలో రెండు సంవత్సరాల కోవిడ్ విరామం తర్వాత ఈ మేడే సందర్భంగా రోమ్‌లోనూ, దేశవ్యాపితంగా కార్మిక ప్రజానీకపు నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం విరమించాలని వారు డిమాండ్ చేశారు.

బ్రెజిల్‌లోని సావోపాలోలో మేడేనాడు భారీ సభ జరిగింది. వామపక్ష అభిమానులంతా ఈ సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రియోడిజెనీరోలో 'వామపక్షం దేశానికి ప్రమాదం' అని నినదిస్తూ మితవాదులు కౌంటర్ ప్రదర్శనలు జరిపారు.

హైతీ, కొలంబియాలలో కార్మికులు మేడేనాడు ప్రదర్శనలు నిర్వహించారు. చేతిరాత పోస్టర్లను చేబూని హైతీలో కార్మికులు తమ తక్కువ వేతనాలపై దృష్టిసారిస్తూ నినాదాలు చేశారు. పారిశ్రామిక కార్మికులు వేతన పెంపు డిమాండ్ చేశారు.

కొలంబియాలో కార్మికులు ప్రదర్శన చేస్తూ ఉక్రెయిన్‌పై రష్యా తక్షణం యుద్ధం నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

గ్రీస్‌లోని ఏథెన్స్‌లో మెట్రో రైళ్ళు, ఓడలు నిలిచి పోయాయి. వేలాది కార్మికులు మేడే ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఇంధన, ఆహార ధరలు పెరిగిపోవటాన్ని వీరు తీవ్రంగా నిరసించారు. విద్యుత్, గ్యాస్ ధరలు పెరిగిపోవటాన్ని నిరసిస్తూ, రష్యాపై విధించిన ఆంక్షలతో గ్రీస్‌లో ద్రవ్యోల్బణం మరింత పెరిగిపోయిందన్నారు.

*****